


# చిన్న అబద్ధం

శాత్రకోట సుబ్బారావు

ఒక చిన్న అబద్ధం...!
ఎంత ఉపకారం చేసిందో...!?
ఒక ఆశకి ప్రాణం పోసింది...
నిరుత్సాహపు చీకట్లో అగ్గిపుల్ల గీసింది.
మహేశ్వర్‌కి థ్యాంక్స్ చెప్పాలి.
ఆ ఐడియా తట్టింది అతడికే.
అవసరంతో కంగారుపడ్డం సహజం. కానీ, అవసరంలో చప్పున ఐడియా రావడమే విశేషం.

"ఆ ఐడియా మహేశ్వర్ మెదళ్లో మెరుపులా మెరిసింది... నాకు కాంతి నిచ్చింది." అనుకున్నాడు అనంత్.

"దేనికిరా కంగారూ...ట్రైన్ మిస్సవుతాననే ఆలోచిస్తున్నావు కానీ-ట్రైన్ మిస్సవకూడదన్న ఆలోచన చెయ్యడంలేదు నువ్వు..." అని మహేశ్వర్ నింపాదిగా అన్నప్పుడు అర్థం చేసుకోలేకపోయాడు అనంత్.

పాదరసంలా వీధిలోని కాయిన్‌బాక్స్ దగ్గరికెళ్లి ఫోన్‌చేసి వచ్చాడు మహేశ్వర్. వచ్చీ రాగానే- "తొందరేం లేదు... కృష్ణా ఎక్స్‌ప్రెస్ ప్లాట్ ఫారం మీద అర గంట ఆగుతుంది... నిదానంగా లగేజంతా సర్దుకో... సర్టిఫికేట్స్ అన్నీ సరిగా వున్నాయో లేదో -ఓసారి వెరిఫై చేసుకో. మరో పదిహేన్నిముషాల తర్వాత బైల్దేరినా మనం నిశ్చింతగా ట్రైన్ అందుకోగలం..." అన్నాడు దృఢంగా.

"థ్యాంక్యూ మహేశ్వర్" ఇంతకీ నువ్వు ఫోన్ చేసిందెవరికిరా? రెండు నిముషాలు ఆగే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ని అరగంటపాటు ఆపేయమని ఎవరితో చెప్పావ్? నీకు అంత పలుకుబడి ఉందని నాకెప్పుడూ చెప్పలేదే?!" సందేహనివృత్తి కోసం అడిగాడు అనంత్.

"వెరీ సింపుల్... వన్‌డబుల్ జీరోకు డయల్ చేశా..." కొంచెం గర్వపడుతూనే చెప్పాడు.

"చేసి, ఏంచెప్పావ్?" అనంత్‌లో ఆతృత పెరిగింది.

"ఏం చెప్పానా? నేను ప్లాట్‌ఫారం మీంచి మాట్లాడు తున్నానండీ... ఇక్కడెవరో ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకోవడం విన్నాను...ట్రైన్‌లో అమర్చిన బాంబు ఇక్కడ పేలుద్దామా! బ్రిడ్జిపైన పేలుద్దామా- అని ఉర్దూలో మాట్లాడుకుంటున్నారు... మీరు వెంటనే రావాలి. ట్రైన్‌కేదో ప్రమాదం జరగబోయేలా ఉంది... అన్చెప్పాను..." మహేశ్వర్ ముఖంలో తొణుకు లేదు...ధీమాగా ఉన్నాడు.

"మళ్లీ థ్యాంక్స్ రా... ఈ ఉద్యోగం వస్తే... మొదటి జీతమంతా నీ పేరిట ఏ అనాధాశ్రమానికో విరాళంగా ఇస్తా..." అతడి రెండు చేతులూ పట్టుకున్నాడు అనంత్ కృతజ్ఞతాపూర్వకంగా...

చిన్న అబద్ధమే... ఒక ఆశని నిలబెట్టింది. ఒక జీవితానికి దారిచూపబోతోంది. తప్పులేదు. అవసరానికీ, అదీ అత్యవసరానికి అబద్ధం ఆడినా, స్వార్థంలేని అబద్ధం సాక్షాత్తూ నూరు నిజాలతో సమానం... దాటిపోతున్న వయసుకు చివరి ఇంటర్వ్యూ. ఫలితం ఖచ్చితంగా ఉండాలని పకడ్బందీగా మూడు లక్షలతో అన్ని ఏర్పాట్లూ చేశాడు అనంత్ తండ్రి చతుర్వేదుల సీతారామయ్య.

ఆ ఇంటర్వ్యూకే విజయవాడ బయల్దేరాలి అనంత్. అర్థం పర్థం లేని పవర్‌కట్ కారణంగా, గీజర్ పన్చేయటంలేదు... అక్కడ్నుంచి అన్నీ అయిదేసి నిముషాలు లేటు. ఎప్పుడూ లేటొచ్చే కృష్ణా ఎక్స్‌ప్రెస్సే! ఈరోజు ఖచ్చితంగా కరెక్ట్ టైమే! అది మిస్సయితే టైమ్‌కి ఇంటర్వ్యూ అందుకోవటం చాలా కష్టం!

***

కాలం కత్తిపడవ అన్నాడో ఆధునిక కవి.

కత్తి పడవ మూడేళ్ల సముద్రంలో ముందుకు సాగిపోయింది. చరిత్రని కడుపులో దాచుకొని-

ఈ మూడేండ్ల కాలంతో చాలా జరిగిపోయాయ్. మొదటి జీతం అనంత్ మహేశ్వర్ పేరిట అనాధాశ్రమానికి ఇచ్చాడో లేదో తెలీదు కాని, అతడికా ఉద్యోగం వచ్చి మాత్రం మూడేళ్లయింది... పెళ్లి కూడా అయిపోయింది... ఇప్పుడు అనంత్ కొడుక్కి ఏడాదిన్నర వయసు. మొన్నా మధ్యనే కేరళ కాన్వెంట్లో ఆయమ్మలకు అప్పగించాడు.

చతుర్వేదుల సీతారామయ్య సబ్ రిజిస్ట్రార్‌గా ఆర్నెల్ల క్రితమే రిటైరైపోయారు. వంశోద్ధారకుడొక్కడే! అనంత్ పుట్టిన ఆరేళ్లకే భార్యపోవడంతో- అనంత్‌ని గారాబంగా పెంచుకున్నాడు- చదువులకు బయటకు పంపకుండా! మనవడు పుట్టి ఉండకపోతే వృద్ధాశ్రమాన్ని గురించి ఆలోచించేవాడేమో- ఇప్పుడైతే వాడి ఆలనా పాలనా చూసుకోవడానికి ఆఫీస్ అవర్సంత టైం కూడా సరిపోవటంలేదు. ఆయమ్మల దగ్గరికి వెళ్లే ముందు, వచ్చాక-మనవడితోనే ఆయన కాలక్షేపం. రోజుకి ముప్పయ్ గంటలైతే బాగుండనిపిస్తుంది. కానీ, కాలం కత్తి పడవ... అదెవరి మాటా పట్టించుకోదు.

అనంత్‌కైతే ఉద్యోగం వచ్చింది కానీ మహేశ్వర్‌కి ఆ అవకాశం రాలేదు. కారణాల లోతుల్లోకి వెళ్లకుండా ఉండగలిగితే ప్రస్తుతం మహేశ్వర్ ఓ టాక్సీ కొనుక్కుని తనే డ్రైవర్‌గా ఫిక్స్ అయిపోయాడు. రెండు చేతుల్నే నాలుగుచేసుకొని, నాలుగు చేతులా సంపాదిస్తున్నాడు. స్వతహాగా తెలివితేటలు పుష్కలంగా ఉన్నవాడు కాబట్టి, టాక్సీని ప్రభుత్వాసుపత్రి ముందే స్టాండులో ఠికానా పెట్టించాడు. చావు గిరాకీ తగిలితే టెన్ ఈస్ట్ ఎయిట్ రాబడి... అంటే ఖర్చు పది-లాభం ఎనభై! మామూలు తవ్వాబేరం వచ్చిందంటే పదికి ఇరవై కలిసి వస్తుంది.

మహేశ్వర్ టాక్సీకున్న ఒకే ఒక సుగుణం -నొప్పులుపడే ఏస్త్రీ కోసమైనా అది ఫ్రీ అంబులెన్స్‌గా మారిపోతుంది. అతను-అవతల పదివేలరూపాయల అద్దె గిరాకీ వున్నా, మొట్టమొదటి అవకాశం మాత్రం గర్భవతులకే ఇస్తాడు. ఆ కారణంగానే మహేశ్వర్ టాక్సీ సిటీలో అందరి నోళ్లలోనూ చిత్తడిగా నానిపోయింది.

చావు మేళాన్ని తీసుకెళ్తున్నా అతడి టాక్సీని చూసి "పాపం ఏతల్లికి పురుడొచ్చిందో! దేవుడా! సుఖంగా కాన్పు అయ్యేట్టు చూడు తండ్రీ! అని మనసులోనే మొక్కుకునే ఆడవాళ్లెంతమందో... వాళ్లెన్ని మొక్కులు మొక్కినా కానుపెప్పుడూ సుఖంగానో, ప్రశాంతంగానో అవదు. అదెప్పుడూ భయంకరమైన నరకమే... అమ్మ మాత్రమే అనుభవించే ప్రత్యక్ష నరకం...

పల్లెటూళ్లకి జబ్బు చేస్తే మహేశ్వర్‌కి మహారాజయోగం పట్టినట్టే... సిటీ


అపోలో హాస్పిటల్ గ్రూప్
ఇప్పుడు తిరుపతిలో
అపోలో క్లినిక్

అత్యంత నాణ్యమైన వైద్యసేవలు
అందిస్తున్న అపోలో క్లినిక్ నందు
ముందస్తు ఆరోగ్య సేవలు
(టోటల్ బాడీ చెకప్స్) అందిస్తున్నది
ముఖ్యంగా



- అపోలో మాస్టర్ హెల్త్ చెకప్
- అపోలో ఎగ్జిక్యూటివ్ హెల్త్ చెకప్
- అపోలో హార్ట్ చెకప్

ఇందులో ఒక మనిషి ఆరోగ్యానికి సంబంధించిన అన్ని పరీక్షలు చేయడం జరుగుతుంది
వీటితో పాటు

- క్లినికల్ ల్యాబ్
- X-Ray
- ECG/TMT/Echo
- 24 hrs Pharmacy
- Ultra Sound
- డెంటల్ క్లినిక్

The Apollo Clinic
Complete Healthcare, Under One Roof

అపోలో క్లినిక్
నెం. 19-9-29/ఎ, తిరుచానూరు రోడ్ శంకరంబాడి సర్కిల్
తిరుపతి - 517 501 ఫోన్: 0877-2255277, 377, 477
ఈ మెయిల్: tirupati@theapolloclinic.com

చుట్టూ ఉన్న పల్లెల్లో గోడలపైన, 'ఆత్మ బంధు-94405 29785- అర్ధ రాత్రయినా అపరా త్రయినా ఒక్క ఫోన్ కొట్టండి.. క్షణాల్లో మీ ఇంటి ముందు ఉంటాను...' అంటూ ఎమర్జెన్సీ 108 ఫిలాసఫీని కాపీకొట్టి మరీ రాయించేశాడు. ఐడియా క్లిక్కయ్యింది.

ఫోన్ల మీద ఫోన్లు వర్షంలా వచ్చి పడుతుం టాయ్. దాంతో రోజూ ఫోన్ కాల్స్‌కి కొన్ని అబద్ధా లతో జనాల్ని తన టాక్సీకోసం నిరీక్షించేలా చేసుకో వటాని క్కూడా అలవాటు పడిపోయాడు.

మొన్నకి మొన్న-''ఫలానా మంత్రి తాలూకు, చిన్నింటి పాపగారండీ... పాపం...మంత్రిగారిపైన అలిగి విషం తాగేసింది పిచ్చిది... ఆస్పత్రిగేటు దాకా వచ్చేశాను...దించేసి మీ ఊరికి వచ్చేయ టమే... ఇదిగో...మహా అంటే అరగంట..'' అంటూ ఒక అబద్ధం.

వాస్తవానికి కాకా హోటల్లో వేడివేడి సమో సాతో పాటు దమ్‌కీ చాయ్ లాగిస్తున్నాడా పూట. టాక్సీడ్రైవర్లతో తీరిగ్గా భైఠాయించి చమ్కీలు వొదు లుతున్నాడు.

నిన్నటికి నిన్న- ''గంగపట్నం దగ్గర విరాట రాజు పల్లెనే కదా...సిటీ నుండి 27కిలోమీటర్లు. ఎంత అలాగా లెక్కవేసుకున్నా ఇరవైనిముషాల ప్రయాణం... ఇప్పుడు వేదాయపాణం దగ్గరు న్నాను... మన హీరో రవితేజకి-వరసకి పిన్ని కూతు రౌతుంది...లవ్‌ఫైల్యూర్...పురుగుల మందు తాగే సింది. ఐదునిముషాల్లో దించేసి.. అంటే.. అర గంటలో ఖచ్చితంగా మీ ఇంటి ముందు ఉంటాను... సరేనా?'' అంటూ మరో అబద్ధం ఆడే శాడు-

మెకానిక్ నాగూరు షెడ్డులో టాక్సీ రిపేర్ చేయిస్తూ!!!

కొందరికి అబద్ధాలాడటం సరదా..టైంపాస్ చేయడానిక అబద్ధాలాడుతుంటారు... ఎదుటి వాళ్ల మెహర్బానీ పొందటం కోసం అబద్ధాలాడుతుం టారు కొందరు. తాము చాలా తెలివైన వాళ్లమని జనాల్ని నమ్మించటం కోసం అబద్ధాలాడుతుం టారు. కానీ, మహేశ్వర్ దగ్గరికొచ్చేసరికి అన్ని సూత్రాలూ విభేదిస్తాయి. అతను అవసరం కోసమే అబద్ధాల్ని అలవాటు చేసుకున్నాడు. దానివల్ల జరిగే లాభ నష్టాల్తో అతడికి నిమిత్తం లేదు.

తన అవసరం తీరాలి- అంతే!

***

నవజీవన్‌కి నెల్లూరు చేరుకున్నాడు అనంత్. కరక్ట్ టైమ్‌కే వచ్చింది. ఒక్క రెండంటే రెండు నిము షాలే లేటు. భారతీయ పరిపాటిలో ఆమాత్రం ఉండాలి. యధార్థంగా క్షమించేయవచ్చు. అయినా అనంత్ కిప్పుడు కరక్ట్ టైమ్‌లు ఆలస్యంతో పెద్దగా నిమిత్తం లేదు.

మహేశ్వర్ అంతక్రియల్లో పాల్గొనడానికొ చ్చాడు. బాడీ, ఇంకా పోస్ట్ మార్టమ్ దశలోనే ఉందని, ట్రైన్ నెల్లూరుకి చేరే మొందే మహేశ్వర్ బామ్మర్ది రఘునాధ్ ఫోన్ చేసి చెప్పాడు. అతడు 108 ఎమర్జన్సీ అంబులెన్స్‌కి పైలెట్‌గా పని చేస్తుంటాడు. పోస్ట్‌మార్టమ్ పూర్తయ్యే సరికి మధ్యాహ్నం మూడు దాటొచ్చన్నాడు. సాయంత్రం ఆరు గంటలకి ఎత్తుబడి పెట్టుకు న్నారు.

ప్లాట్‌ఫారం పైన దిగ్గానే కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఉదంతం గుర్తొచ్చింది అనంత్‌కి! ఆపూట మహే శ్వర్ కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ని అరగంట పాటు స్టేషన్‌లో ఆగేలా చేసి ఉండకపోతే తనకు జీవితంలో ఉద్యోగ యోగం ఉండేది కాదు. కన్నీళ్లు తన్నుకొచ్చాయ్. ముఖం తుడుచుకుంటున్నట్టు కర్చీఫ్‌తో కన్నీళ్లూ తుడుచుకున్నాడు ప్రయాణికుల మధ్య నడుస్తూ. ఆ నడక వేయింగ్ మిషన్ దగ్గర మంత్రం వేసినట్టు ఆగిపోయింది. ఎప్పుడు స్టేషన్‌లోకి అడుగు పెట్టినా ముందుగా మహేశ్వర్ ఆ వేయింగ్ మిష నెక్కి బరువు చూసుకునేవాడు. అతనికదో అల వాటు.

'పెరుగుతున్నాయా, తరుగుతున్నామా అని కాదురా! ప్రమాదపు అంచులు దాటుతున్నామా అని చూసుకోవటానికీ వెయిట్ చెక్ చేసుకోవాలి' అంటూ మేధావిలా మాట్లాడేవాడు. వాడి ఆ మేధావి తనమే... చివరికి వాడి ప్రాణాలు హరించే సింది.

మహేశ్వర్‌కి శ్రద్ధాంజలి పూర్వకంగా వేయింగ్ మిషనెక్కి నిలబడ్డాడు అనంత్. రూపాయి కాయిన్ వేస్తే టిక్కెట్ బరువుతో పాటు భవిష్యత్తులో జరగ బోయే ఓ జ్యోతిషం టిప్ కూడా వస్తుంది.

తిరగేసి చదివాడు-

''మీ బాల్యమిత్రుల్ని కలిసి సరదాగా గడుపు తారు''- పెదవులపైన చిరునవ్వుతో పాటు కళ్లల్లో నీళ్లూ చిందాయ్-విరక్తిగా!

అనంత్‌కి బాల్యమిత్రులంటూ లేరు. ఉన్న మిత్రుడు ఒక్కడే... అతడితో ఇప్పుడు సరదాగా గడపటం ఎక్కడ? కనీసం కన్నీళ్లతో గడపటం కూడా సాధ్యపడదేమో!

తనని వదిలేసి వెళ్లిపోయినందుకు బాధలేదు అనంత్‌కి... నాలుగేండ్ల కూతుర్ని, రెండేళ్ల కొడుకునీ వదిలేశాడు. నూరేళ్లు నీడలా తోడుంటానని అగ్ని సాక్షిగా ప్రమాణం చేసిన భార్య సుజాతని వదిలే శాడు. కన్నతండ్రిని వదిలేశాడు. చివరికి తొమ్మిది నెలలు కడుపులో మోసి, కని, పెంచి పెద్ద చేసిన అమ్మని కూడా వదిలేశాడు. అందర్నీ వదిలేసి ఒంట రిగా వెళ్లిపోవడానికి సిద్ధమైపోయాడు... అదీ బాధ.

ఆటో ఎక్కి నేరుగా గవర్నమెంటు ఆసుపత్రికి చేరుకున్నాడు. పోస్ట్ మార్టమ్ గది ముందు-బంధు వులందరూ చేరారు అప్పటికే! అన్నుందేవర వంశం వాళ్లంతా దాదాపుగా జిల్లాలోనే ఉన్నారు... దూరా భారం రావల్సిన వాళ్లు బహుశా ఎవరూ ఉండకపో వచ్చు. ఒక్క భార్య సుజాత తరపు బంధువులే ఒంగోలు నుండి రావాలి. వాళ్లూ ఈ పాటికి వచ్చేసే ఉంటారు. ఉదయం ఎనిమిది గంటలకి ప్రమాదం



జరిగింది... తొమ్మిదింటికల్లా అందరికీ అందింది కబురు.

పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన రైతు కుటుంబం నుండి ఫోన్ వస్తే వెంకటాచలానికి (గ్రామం పేరు) తీసుకుని బయల్దేరాడు- మహేశ్వర్. చనిపోయే మనిషి ప్రాణం నిలబెట్టాలి- డైవర్షన్ రోడ్డు నుంచి బైపాస్ రోడ్డులోకి క్రాస్ చేస్తుండగా పధ్నాలుగు చక్రాల ట్రైలర్ గుద్దేసింది.

కార్లోంచి ఎగిరి రోడ్డు మీద పడ్డాడు మహేశ్వర్. ఇరవైనిముషాలపాటు రోడ్డు మీద అతడి శరీరం చేప పిల్లలా గిలగిల కొట్టుకుంది. ఆ తర్వాతే ప్రాణం పోయింది.

పోస్ట్ మార్టమ్ గది దగ్గరికి చేరుకునే సరికే రఘునాథ్ ఎదురొచ్చాడు. అప్పటికే కళ్లల్లో కన్నీళ్లారి పోయినట్టున్నాయ్...

''రఘూ! పోస్ట్ మార్టమ్...?'' తనే ముందుగా ప్రశ్నించాడు అనంత్...

''అయిపోయిందన్నాయ్! అంబులెన్స్ కోసం ఎదురుచూస్తున్నాం.. అది రాగానే బయల్దేరటమే...'' చెప్పాడు రఘు.

''అంబులెన్స్ దేనికి రఘూ! నువ్వే 108 పైలట్‌వి కదా- పర్మిషన్ తీసుకో... అందులోనే తీసుకెళ్దాం...''

''108 ఎమర్జీన్సీ ప్రాణదాత అన్నయ్యా! శవాలు తీసుకెళ్లడానికి పర్మిషన్ ఇవ్వరు...''

''108 ఎమర్జీన్సీ ప్రాణ దాతైనా ఏమిటి లాభం? జీవదాతైనా ఏమిటి లాభం? ఇరవైనిముషాల సేపు మీ బావ శరీరం రోడ్డు మీద గిలగిల కొట్టుకున్నప్పుడెక్కడుంది మీ ప్రాణదాత...?'' అనంత్ రఘు వంక ఉక్రోషంగా చూస్తూ అన్నాడు. ఆసన్నివేశం తలచుకుంటుంటేనే గుండెల్లో కెలికినట్టుంటుంది అతనికి.

''నా బాధ కూడా అదే అన్నయ్యా! ఒక్క నిమిషం ముందుగా బావకియాక్సిడెంట్ అయినట్టు ఫోన్ వచ్చివున్నా ఆయన ప్రాణాలు కాపాడి ఉండే వాళ్లం... అంతకు ఒక్క నిమిషం ముందే రామాజీ వీధి నుండి ఫోనొచ్చింది. ఆంజనేయ స్వామి గుడికెదురుగా వున్న ఇంట్లో హార్ట్ ఎటాక్‌తో రాజాచంద్ర అనే వ్యక్తి చావుబతుకుల మధ్య ఉన్నాడని, తక్షణం రమ్మని! 108 అక్కడికి వెళ్లింది. ఆదార్లో ఉండగా బైపాస్ రోడ్లో యాక్సిడెంట్ అనీ, ఎపి26కె-1818 టాక్సీని బైపాస్ డైవర్షన్‌లో ట్రైలర్ గుద్దేసిందనీ, కారు డ్రైవర్ రోడ్డు మీద పడి గిలగిలా కొట్టుకుంటున్నాడనీ-ఒక్కగుక్కలో అంతా చేప్పేశారెవరో... వైర్‌లెస్ సెట్‌లో అంతా స్పష్టంగా విని పిస్తూనే ఉంది... అన్నయ్యా! టాక్సీ నెంబరు విన్నప్పుడే గుండె జారిపోయింది. కానీ ఫస్ట్ కమ్ ఫస్ట్ సెర్వ్ పాలసీ కింద రామాజీ వీధి కేసు అటెండ్ అయ్యాక కానీ రెండో కాల్ అటెండ్ చేయడానికి లేదు. దటీజ్ బాడ్‌లక్... ''రఘు స్వరం బాధగా పలికింది.

''అయినా రఘూ! రామాజీ వీధిలో చూసుకుని, బైపాస్ చేరుకోడానికి పదిహేన్నిముషాలు చాలుకదా?''

''అవును....చాలన్నయ్యా! లెక్క కరెక్ట్ అయి వుంటే...''

''అంటే...?'' ఉలిక్కిపడ్డాడు అనంత్.

''ఆ వచ్చిన ఫోన్ అబద్ధం! ఆంజనేయస్వామి గుళ్లు మూడున్నాయా వీధిలో... మూడుగుళ్ల చుట్టూ తిరిగి ఎంక్వయిరీ చేసే సరికే పదిహేన్నిముషాలు దాటిపోయాయి.... అబద్ధపు ఫోను బావ ప్రాణాల్ని మింగేసింది...'' అనంత్ భుజం మీద తల వాల్చేసి పసిపిల్లాడిలా ఏడ్చేశాడు రఘు.

అతడ్ని ఓదార్చే స్థితిలో లేడు అనంత్... ''ఒక ఫేక్‌కాల్... ఒక చిన్న అబద్ధం... మహేశ్వర్ ప్రాణాలు పోవడానికి కారణమైంది...''

ఆ షాక్‌లోనే ఉన్నాడు అనంత్. ★

